నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | మార్చి 06, 2024 | www.navatelangana.com

చేపల పెంపకానికి ముందుకు రావాలి

నవతెలంగాణ-గాంధారి

రుణాలు తీసుకొని యూనిట్‌గా చేపల పెంపకం చేపడితే ఆర్థిక అభివృద్ధి సాధించొచ్చని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్‌బాబు సూచించారు. గాంధారి మండల కేంద్రంలో మంగళవారం అవగాహన కల్పించారు. సంస్థ ద్వారా రుణాలు తీసుకుని యూనిట్ ఏర్పాటు చేసుకుని అభివృద్ధి పథంలో ప్రయాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ గాంధారి మేనేజర్ వేణు ఉట్నూర్ మేనేజర్ అశోక్‌రెడ్డి, లింగంపేట్ మేనేజర్ అరుముగం, మండల సమఖ్య అధ్యక్షురాళ్ళు పుష్ప రాణి, శోభ, సులోచన, ఆక్వా ఉదయ్, గాంధారి ఏపీఎం గంగరాజు లింగంపేట్ సదాశినగర్ ఏపీఎంలో సీసీలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమేశ్‌బాబు

రంగురాళ్ల విక్రయ కలకలం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని అన్నారంలో రెవెన్యూ భూమిలో రంగురాళ్లు తవ్వి విక్రయించారు. గ్రామానికి చెందిన చిన్న లక్ష్మీ గంగాధర్, అన్నారం రెవిన్యూ శివారులోని సున్నపురాళ్ల తండా ప్రాంతంలో గల 288 సర్వే నెంబర్లో కుటుంబ సభ్యుల పేరు పైన గల ఐదు ఎకరాల్లో రంగురాళ్లను తవి, బ్రోకర్లకు, ట్రాక్టర్ లోడు రూ 5 వేలకు, మూడు లోడ్లు రంగురాళ్లు విక్రయించినట్లు అటవీ అధికారుల విచారణలో గంగాధర్ వెల్లడించారు. ఘటనపై ఇన్చార్జి ఎమ్మార్వో లక్ష్మణ్‌ను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, నేడు విచారణ చేపట్టి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. అటవీ అధికారులు రంగురాళ్లు తవ్విన స్థలాన్ని పరిశీలించారు.


పరిశీలిస్తున్న అధికారులు


కలెక్టరేట్‌కు వచ్చిన ఇరిగేషన్ శాఖలో పని చేస్తున్న పూర్వ వీఆర్‌వోలు

పని చేస్తున్నా.. జీతం రావట్లే

- ఇరిగేషన్ శాఖలో పని చేస్తున్న పూర్వ వీఆర్‌వోలకు ఏడు నెలలుగా అందని వేతనం

నవతెలంగాణ-కామారెడ్డి

నిజాంసాగర్ ఇరిగేషన్‌లో పని చేస్తున్నా తమకు వేతనం రావడం లేదని మాజీ వీఆర్‌ఏలు 93 మంది వాపోయారు. ఏడు నెలలుగా నిర్వహిస్తున్న ఇప్పటివరకు ఒక నెల వేతనం కూడా రాలేదని లశ్కర్స్, హెల్పర్స్ గా విధులు నిర్వహిస్తున్న మాజీ విఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చారు. నిజాంసాగర్ ఇరిగేషన్‌లో 10-08-2023 విధుల్లో చేరామని ఐడి నెంబర్ వచ్చిందని, పాన్ నెంబర్ రానందున తమకు వేతనాలు చెల్లించడం లేదని అన్నారు. వీఆర్‌ఏలను వివిధ డిపార్ట్మెంట్లో తీసుకునే సమయంలో బాన్సువాడ, ఎల్లారెడ్డి, జూకల్ పిట్లం, మద్నూర్ తదితర మండలాల్లో 350 మంది వీఆర్‌ఏలు ఉండగా వారిని వివిధ డిపార్ట్మెంట్ లకు పంపగా 93 మందిని ఇరిగేషలో పెట్టారన్నారు. ప్రస్తుతం 350 నుండి 100 మందిని తొలగించుకోండి అని కలెక్టర్ కార్యాలయ వివో కార్యాలయం సిబ్బంది పేర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు 350 మందిని విధుల్లోకి తీసుకున్న సమయంలోనే 250 మందిని తీసుకొని వందమందిని వేరే డిపార్ట్మెంట్ కు తరలిస్తే బాగుండేదని ప్రస్తుతం మా మధ్యలోనే గొడవలు పెట్టేందుకు అధికారులు చూస్తున్నారన్నారు. అధికారుల స్పందించి తమకు వేతనాలు అందేలా చూడాలని ఈ సందర్భంగా అధికారులను కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సాయిరాం, సుదర్శన్, సంజీవులు, పెంటయ్యలతో పాటు 93 మంది మాజీ వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

జోరుగా మాస్‌కాపీయింగ్

- తనిఖీలు చేస్తున్నట్టు చెప్తున్నా.. ఆగని చూచిరాతలు
- విద్యార్థుల జీవితాలతో
- పలు ప్రయివేటు విద్యాసంస్థల చెలగాటం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్ పరీక్షలు గాడితప్పుతున్నాయి. పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు అధికారులు చెప్తున్నా.. జోరుగా మాస్‌కాపీయింగ్ కొనసాగుతున్నట్టు సమాచారం. బోధన్‌లో హాస్టల్‌లో చిట్టీలు కొట్టొద్దన్నందుకు డిగ్రీ విద్యార్థిని దారుణంగా కొట్టి హత్య చేయడం మాస్ కాపీయింగ్ తీరుకు నిదర్శనంగా నిలిచింది. పలు ప్రయివేటు కాలేజీలు మాస్‌కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీని వల్ల విద్యార్థుల బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాపీయింగ్‌కు పాల్పడితే భవిష్యత్తులో పోటీ పరీక్షల్లో, ఎంట్రెన్స్‌లలో రాణించలేకపోతారని పేర్కొంటున్నారు. మంగళవారం నగరంలో చిట్టీలు దర్శనమివ్వడం కలకలం రేపింది.

గత నెల 28వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమైయ్యాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 35345 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 57 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు, మాస్ కాపీయింగ్ నిరోధించేం దుకు సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. రోజువారీగా తనిఖీలు చేపడుతున్నట్టు అధికారులు రిపోర్ట్ పెడుతున్నా.. మాస్ కాపీయింగ్ మాత్రం అరికట్టలేకపోతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు ఐదుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు.

ఇప్పటికే జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి పరీక్షల కన్నా ముందు నుంచి అన్ని కేంద్రాల్లో పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్న ప్పటికీ, వారి ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోకుండా.. పలు ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు ఇంటర్మీ డియట్ ర్యాంకుల కోసం కక్కుర్తి పడి పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్టు సమాచారం. విచ్చలవిడిగా నక్కలు చిట్టీలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలైన రెండు కళాశాలలు ఎట్టి పరిస్థితుల్లో తమ కళాశాలలకు ర్యాంకులు రావాలని దుర్బుద్ధితో ఈ మాస్ కాపెయింగ్‌కు తెర లేపారని విద్యార్థి సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత.. ప్రశ్న పత్రాల జవాబులు ఏ4 సైజ్ పేపర్‌లో ప్రింట్ అయి సెంటర్‌లో ఉన్న పలువురు విద్యార్థులకు చేరవేస్తున్నట్టు సమాచారం. అధికారులు స్పందించి ఇలాంటి వాటిని నిరోధించి విద్యార్థుల బంగారు భవిష్యత్తును కాపాడాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.





కాపీయింగ్‌ను అరికట్టాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్



పరీక్ష కేంద్రాల వద్ద, పర్యవేక్షకుడు విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించ సమయం లోనే, సక్రమంగా తనిఖీలు చేసి పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించాలి. ఏ పరీక్ష కేంద్రం లో అయితే సక్రమంగా విద్యార్థులను తనిఖీలు చేయకుండా పరీక్ష కేంద్రంలోకి అనిమతిస్తున్నారో ఆ పరీక్ష కేంద్రాలను వచ్చే సంవత్సరం పరీక్ష కేంద్రాలకు అనుమతి ఇవ్వకూడదని అన్నారు.

తనిఖీలు చేస్తున్నాం

రఘురాజ్ డిఐఇఓ



పరీక్ష కేంద్రానికి వెళ్లే సమయంలోనే విద్యార్థు లను పర్యవేక్షణ బృందం తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో ఏమైనా చిట్టీలు దొరికితే వాటిని తీసుకొని పారేస్తున్నాం. అలాంటి చిట్టీల ఫోటోలు వైరల్ అవుతుండటం తో కాపీయింగ్ జరుగుతున్నట్టు ప్రచారం చేస్తున్నారు. ఇన్విజిలెటర్‌లకు, స్క్వాడ్‌లకు ఇది వరకే ఆదేశాలు జారీ చేశాము. ప్రతి పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

- బోధన్ హాస్టల్‌లో హత్యకు గురైన విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత


విద్యార్థి కుటుంబీకులను ఓదారుస్తున్న ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-గాంధారి/సదాశివనగర్

గాంధారి మండలంలోని తిప్పారం తండాకు చెందిన విద్యార్థి బోధన్ బీసీ హాస్టల్ లో మరణించిన హర్యాల వెంకట్ రామ్ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాజీ ఎమ్మెల్యే జాజల సురేందర్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎమ్మెల్సీ కవిత, అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. వెంకట్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ కవిత ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కవిత అధికారులను డిమాండ్ చేశారు. అంతేకాదు బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి, ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవిత వెంట మాజీ ఎమ్మెల్యే సురేందర్, జడ్పీటీసీ సభ్యులు శంకర్ నాయక్, ఉన్నారు.

రోడ్డు ప్రమాదం దురదృష్టకరం

సదాశివనగర్ : రోడ్డు ప్రమాదంలో సొసైటీ డైరెక్టర్ ఏనుగు జనార్ధన్‌రెడ్డి, ఆయన భార్య ప్రతిభ మృతిచెందగా.. వారి కుటుంబాన్ని ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మంగళవారం పరామర్శించారు. ఘటన దురదృష్టకరమని ఆవేదన వెలిబుచ్చారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఆకతాయిలకు షీ టీమ్‌తో అడ్డుకట్ట

నవతెలంగాణ-తాడ్వాయి


మాట్లాడుతున్న ఎస్ఐ

పాఠశాలకు వస్తున్న సమయంలో ఎవరైనా ఆకతాయిలు అడ్డుకొని అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే సి టీమ్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. తాడ్వాయి మండల కేంద్రంలోని రవీంద్ర భారతి పాఠశాలలో మంగళవారం ఆయన ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు ఎక్కువైపోయాయని ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపి చెప్పమంటే చెప్పవద్దని సూచించారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపించే ప్రతి వ్యక్తి హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలన్నారు . ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ గౌడ్, ఇర్ఫాన్ ,ఎల్లారెడ్డి సబ్ డివిజన్ షీ టీం ఇన్చార్జి కానిస్టేబుల్ శ్రీను రవీంద్ర భారతి పాఠశాల ప్రిన్సిపాల్ స్వామి, కరస్పాండెంట్ భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

మద్దికుంట ఆలయ ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

నవతెలంగాణ-రామారెడ్డి


ఆహ్వానపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

మండలం లోని మద్దికుంటలో వెలసిన శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని, ఉత్సవ ఆహ్వాన పత్రికను కలెక్టర్ జితీష్ వి పాటిల్ కు, విద్యుత్ అధికారులకు, పోలీస్ అధికారులకు మంగళవారం అందజేశారు. ఆహ్వాన పత్రికను అందజేసిన వారిలో జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, ఎంపీటీసీ రాజేందర్, మాజీ సర్పంచ్ బొమ్మిడి రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బండి ప్రవీణ్, రగోతం రెడ్డి, తదితరులు ఉన్నారు.

9,10వ తేదీల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్

- జయప్రదం చేయాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గిరిరాజ్ కాలేజీ ప్రిన్సిపల్, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఈనెల తొమ్మిది పదవ తేదీలలో తెలంగాణ యూనివర్సిటీలో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాల నందు కళాశాల ప్రిన్సిపాల్‌తో ఎస్ఎఫ్ఐ కన్వెన్సన్ కరపత్రాలను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అని నినాదించిన దాశరథి గడ్డ నిజామాబాద్ జిల్లాలో ఉన్న తెలంగాణ యూనివర్సిటీలో మార్చి 9 ,10 తేదీలలో జరుగుతున్నాయని, ఈ కన్వెన్షన్ కు రాష్ట్రంలో ఉన్న అన్ని విశ్వవిద్యాలయాల నుండి ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు హాజరవుతున్నట్టు తెలిపారు. అదేవిధంగా ఈ కన్వెన్షన్ లో రాష్ట్రంలో ఉన్న యూనివర్సిటీల పరిస్థితులు, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు, నాన్ టీచింగ్ పోస్టులకై, అలాగే యూనివర్సిటీలకు బడ్జెట్లో కేటాయించ నిధుల గురించి, యూనివర్సిటీల భూములను కాపాడుకునేందుకు ఫెలోషిప్, స్కాలర్షిప్ విడుదల ఇలా అనేక అంశాలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు కార్యచరణ ఈ కన్వెన్షన్ లో రూపొందించుకోనున్నట్టు తెలిపారు. ఈ కన్వెన్షన్ కు ముఖ్య అతిథులుగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పాల్గొంటున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు వేణు జి జి కాలేజ్ కమిటీ సభ్యులు పరమేశ్వర్, లత, నికిత, జూలీ, నితిన్, సంతోష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు గ్యారెంటీలు అందించేందుకు

ప్రజాపాలన సేవా కేంద్రాలు

- పథకాలు అందని వారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలి
- వాటిని నిత్యం పర్యవేక్షించాలి
- అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ ఆదేశాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి

అభయహస్తం ఆరు గ్యారంటీలలో భాగంగా ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద రూ. 500 లకే వంట గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి కింద గృహావసరాలకు ప్రతీ నెల 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఎంపీడీఓ కార్యాలయాలు, మున్సిపల్ వార్డు కార్యాలయాలలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాల ద్వారా అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆపరేటర్ల ద్వారా నిర్ణీత సాఫ్ట్ వేర్ లో అప్ డేట్ చేయించి ఆన్ లైన్లో పంపించాలని, ఈ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. ప్రజా పాలన సేవా కేంద్రాల ద్వారా సాఫ్ట్ వేర్ లో వివరాల నమోదు విధానంపై జిల్లా కలెక్టర్ లతో మంగళవారం విద్యుత్ శాఖ కార్యదర్శి రిజ్వీ ఇతర రాష్ట్ర స్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరాలు తెలియజేశారు.

అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆయా మండలాల ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజా పాలన సేవా కేంద్రాల ఆపరేటర్లకు వీ.సీ ద్వారా ఆయా అంశాలపై అవగాహన కల్పిస్తూ మార్గనిర్దేశం చేశారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ఇప్పటికే క్షేత్రస్థాయి నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, తెల్ల రేషన్ కార్డు వివరాలు, ఆధార్ కార్డు వివరాలు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలు లింక్ ఉన్న దరఖాస్తుదారులకు ప్రభుత్వం 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తోందని కలెక్టర్ గుర్తు చేశారు. అయితే, ప్రజా పాలన దరఖాస్తులు అందించిన సమయంలో వివరాలు సరిగ్గా నమోదు చేసుకోలేకపోయిన దరఖాస్తుదారులకు మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలనే ప్రధాన ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ కేంద్రాల ద్వారా లబ్ధిదారుల గ్యాస్, ఆధార్, రేషన్ కార్డు, విద్యుత్ మీటర్ నెంబర్ తదితర వివరాలను సరి చేయాల్సి ఉంటుందని సూచించారు.


మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజలు తమ తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలను వెంట తెచ్చుకుని ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గృహ జ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాలకు సంబంధించిన వివరాల నమోదు, వాటిని సరి చేసుకోవచ్చని తెలిపారు. ఒక తెల్ల రేషన్ కార్డు పై ఒక గ్యాస్ కనెక్షన్, ఒక విద్యుత్ మీటర్ కనెక్షన్ కు మాత్రమే ఈ పథకాలు వర్తిస్తాయని కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.మకరందు, జెడ్పి సీ.ఈ.ఓ ఉషా, డిప్యూటీ సీ.ఈ.ఓ సుందర వరదరాజన్, డీపీఓ చక్రవర్తి తరుణ్ కుమార్, మెప్మా పీ.డి రాజేందర్, కామారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

ఐసిడిఎస్ సిడిపిఓ సునంద

నవతెలంగాణ-మద్నూర్

ప్రతి రంగంలో మహిళలు పురుషులతో సమానంగా ముందుంటున్నారని మద్నూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ సునంద తెలిపారు. 8న మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం మద్నూర్ మండలంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోగల అంగన్వాడీ టీచర్లకు ఆయాలకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ సునంద మాట్లాడుతూ ఆడ మగ సమానమని ఈరోజులలో మహిళలందరూ అన్ని రంగాల్లో ముందుంటున్నారని మహిళా దినోత్సవం ప్రత్యేకతను వివరించారు. సమావేశంలో మద్నూరు ఎంపీడీవో రాణి, ఎంపీటీసీ సంగీత, సఖి సాయమ్మ, డి హబ్ శారద, సౌందర్య సంధ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌లు వినోద, కొమరవ్వ, దేవ, కరుణ, కవిత, అంగన్‌వాడీ టీచర్‌లు, హెల్పర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో సునంద

క్యాంపస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ డిమాండ్


నినాదాలు చేస్తున్న కార్మికులు

నవతెలంగాణ-భిక్కనూర్

క్యాంపస్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బి టి ఎస్ వద్ద ఉన్న తెలంగాణ సౌత్ క్యాంపస్ లో ఏజెన్సీ ద్వారా విధులు నిర్వహిస్తున్న కార్మికులు చేస్తున్న సమ్మెలో సిఐటియు జిల్లా కన్వీనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ద్వారా విధులు నిర్వహిస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఈ ఎస్ ఐ, పి ఎఫ్, ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా కల్పించాలని తెలిపారు. యూనివర్సిటీలపై చిన్న చూపు తగదని వేతన సవరణ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఔట్సోర్సింగ్ సిబ్బంది, సిఐటియు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గేనా..?

- వైస్ ఎంపీపీతో పాటు ఇద్దరు ఎంపీటీసీల క్యాంప్ రాజకీయం

నవతెలంగాణ-రామారెడ్డి

మండల ఎంపిటిసిలు ఎంపీపీ, వైస్ ఎంపీపీ లపై అవిశ్వాస తీర్మాన నోటీసును ఆర్డీవోకు గతంలో అందజేయగా, నేడు ఉదయం 11 గంటలకు ఆర్డీవో వై రంగనాథ రావు ఆధ్వర్యంలో ఎంపీడీఓ కారులయాలో అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించ నున్నారు. ఎంపీపీ దశరథ్‌రెడ్డి కోర్టు నుండి స్టే తెచ్చుకోగా, వైస్ ఎంపీపీపై అవిశ్వాసపై ఓటింగ్ నిర్వహించనున్నారు. వైస్ ఎంపీపీ రవీందర్ రావు తో పాటు, అన్నారం ఎంపీటీసీ గడ్డం చంద్రకళ గంగారెడ్డి, సింగరాయపల్లి ఎంపిటిసి సత్యాలి చంద్రు నాయక్ క్యాంపునకు వెళ్లినట్టు విశ్వాసనీయ సమాచారం. అవిశ్వాసం నెగ్గాలంటే పదిమంది ఎంపిటిసిల్లో ఏడుగురు ఎంపీటీసీలు మద్దతు ఇవ్వాల్సి ఉండగా, వైస్ ఎంపీపీతో పాటు ఇద్దరు ఎంపిటిసిలు క్యాంపు కి వెళ్ళగా, ఎంపీపీ మద్దతు ఉండకపోవడంతో అవిశ్వాసం నెగ్గుతుందా అని చర్చ కొనసాగుతుంది.

డిగ్రీ కాలేజీలో స్పోర్ట్స్‌మీట్


గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐదురోజులుగా స్పోర్ట్స్ మీట్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ తెలిపారు. ఈ స్పోర్ట్స్ మీట్ క్రీడలలో సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 150 మంది విద్యార్థులు గెలుపొందారని గెలుపొందిన వారికి నెహ్రూ యువ కేంద్ర వారు స్పాన్సర్ గా నిలవగా బహుమతులు అందజేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఈ ఐదు రోజుల స్పోర్ట్స్ మీట్ విజయవంతం చేసిన డాక్టర్ వెంకటేశం, అధ్యాపక బృందం కృషి ఎంతో ఉందని తెలిపారు. స్పోర్ట్స్ మీట్ లో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌ని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా భాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహేర్ బిన్ హందాన్‌ని హైదరాబాద్‌లో మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రితో కలిసి మండల అధ్యక్షులు బాకారం రవి, బండారి నరేష్, ఎర్రన్న, మల్లేష్ యాదవ్, భూషణ్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



తాహెర్‌బిన్‌ను సన్మానించిన నాయకులు

జర్నలిస్టులకు రైల్వే పాసు పునరుద్ధరించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జర్నలిస్టు లకు రైల్వే పాసు పునరుద్ధరణ చేయాలని నిజామాబాద్ జిల్లా టియుడబ్ల్యు-ఐజేయు జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంజీవ్ ఆధ్వర్యంలో మంగళవారం నిజామాబాద్ ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఎంపి ధర్మపురి అరవింద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఎడ్ల సంజీవ్ మాట్లాడుతూ అక్రిడిటేషన్ కార్డు కలిగిన జర్నలిస్టులకు రైల్వే పాసులను పునరుద్ధరించాలని, అలాగే అక్రెడిటేషన్ జర్నలిస్టు వాహనాలకు టోల్ గేట్‌ల వద్ద మినహాయింపు ఇవ్వాలని కోరారు. అందుకు ఎంపి సానుకూలంగా స్పందించి సమస్యల్ని పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యు - ఐజేయు నాయకులు అరవింద్ బాలాజీ, బొబ్బిలి నర్సయ్య, అంతరుపుల నర్సింలు, ప్రసాద్, ప్రమోద్ గౌడ్, గోవింద్ రాజు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య కాలనీ వాసులకు విద్యుత్ మీటర్లు ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న పేదలు

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీవాసులకు విద్యుత్ మీటర్లు ఇప్పించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి నాయక్ వాడి శ్రీనివాస్ మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయక్ వాడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కరెంట్ మీటర్లు లేక సుమారు 30 కుటుంబాలు ఉంటున్నాయని, వేసవికాలంలో వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతారని, కాబట్టి వెంటనే విద్యుత్ మీటర్లు అందించి ఉచిత విద్యుత్తును అందించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ంలో సుందరయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదు

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి విమర్శ

నవతెలంగాణ-బోధన్

రాష్ట్రాన్ని 10 సంవత్సరాలుగా పాలించిన గత ప్రభుత్వం ప్రజలకు ఏమి చేసింది లేదని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ మండలం ఎరాజ్ పల్లి గ్రామంలో ఉపాధి హామీ నిధులు 20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని అన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయడానికి సిద్ధంగా ఉందని, ఇప్పటికే కొన్నింటిని అమలు చేస్తున్నామని అన్నారు. గ్యాస్ సబ్సిడీ ఖాతాలలో వేస్తున్నామని తెలిపారు. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కూడా ప్రారంభమయిందని అన్నారు. పాఠశాలలో ఆడపిల్లలకు ఇబ్బందులు కలగకుండా కొత్త డిజైన్లలో టాయిలెట్స్‌లను నిర్మించడానికి చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. వాటికోసం 12 పాఠశాలల్లో కోటి 50 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. రైతులు సాగునీటిని కాపాడుకోవాలన్నారు. శ్రీరామ్ సాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులలో నీటి కొరత వలన సాగునీటిని వృథా చేయరాదన్నారు. వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా సాగునీరు అందిస్తామన్నారు . పంట పొలాలకు సాగు నీటి కాలువలు మూసుకు పోయా యని ఓ రైతు సమా వేశంలో ఫిర్యాదు చేయగా వాటిని సరిచేస్తా మన్నారు. త్వరలో నిరుపేద లకు ఇందిరమ్మ ఇంటి కలను నెరవేర్చడానికి చర్యలు చేపట్టామని, ఈ పథకంలో అవకత ˘వకలకు పాల్పడితే చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరి ంచారు. అనంతరం 250 మెట్రిక్ టన్నుల సొసైటీ గోదాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విటల్‌రావు, డిసిసిబి డైరెక్టర్ గంగ శంకర్, ఎంపీపీ బుద్ధె సావిత్రి, జడ్పిటిసి లక్ష్మి, ఎంపిటి సి వెంకటే ష్, పలు శాఖల అధికారులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే..



గ్రామపంచాయతీ నూతన భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే.

గోడకు కన్నం వేసి చోరీ

- మొబైల్ షాప్‌లో నగదు, సెల్‌ఫోన్లు అపహరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పోలీస్ కమిషనర్ క్యాంపు కార్యాలయానికి కూత వేటు దూరంలో ఓ మొబైల్ షాప్‌లో సినీ పక్కిలో గోడకు కన్నం వేసి చోరీ చేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. నిజామాబాద్ నగరంలోని తిలక్ గార్డెన్ మున్సిపల్ కాంప్లెక్స్ లో శ్రీ వెంకటేశ్వర మొబైల్స్ షాప్‌లో రాత్రి షాపు వెనుక భాగంలో ఏకంగా గోడకు కన్నంవేసి చోరీ చేసి నగదు, సెల్ ఫోన్లను దొంగలు ఎత్తుకెళ్లారు.అయితే ఈ మొబైల్ షాప్ లోనే గత నెల 25న కూడా చోరీ చేయడానికి దొంగలు ప్రయత్నించిన వీడియోలు సీసీ ఫుటేజ్ లో కనిపించాయి. మంగళవారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. అంతేకాకుండా మొబైల్ షాప్‌లో సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్లను కత్తిరించారు. ఈ చోరీ ఘటనలో సుమారు నాలుగు లక్షల వరకు నగదు, సెల్ ఫోన్‌లను ఎత్తుకెళ్లినట్టు యజమాని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు, క్లూస్ టీం ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాల మెన్ హ్యాండ్‌బాల్ ఎంపికలు

నవతెలంగాణ-ఆర్మూర్

ఉమ్మడి జిల్లాల జూనియర్ మెన్ హ్యాండ్ బాల్ ఎంపికలు పట్టణంలోని పెర్కిట్ విశాఖ నగర్ నవ్య భారతి గ్లోబల్ స్కూలులో మంగళవారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల జూనియర్ మెన్ హ్యాండ్ బాల్ ఎంపికలు నిర్వహించినట్టు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గంగ మోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ మంగళవారం తెలిపారు. ఈ ఎంపికకు నిజామాబాద్ కామారెడ్డి జిల్లాల్లోని స్కూళ్లు, కాలేజీల నుండి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నిజామాబాద్ జిల్లా జూనియర్ మెన్ హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8,9,10 తేదీలలో వరంగల్ జిల్లా జడ్పిహెచ్‌ఎస్ పైడిపల్లి స్కూల్‌లో జరగబోయే 45వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ మెన్ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్, కోశాధికారి గట్టడి రాజేష్ నవ్య భారతి గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ జవహర్ హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, కొండ్రా అంజు, సంజీవ్ నవీన్ రాహుల్ అనూష తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్‌బాల్ ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

ఎల్‌ఆర్‌ఎస్‌పై పోరు బాటకు కలిసిరండి

- ధర్నాను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే వేముల

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఎల్‌ఆర్‌ఎస్‌పై పోరు బాటకు బాల్కొండ నియోజకవర్గ ప్రజలు కలిసి రావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 25 లక్షల మంది ఎల్‌ఆర్‌ఎస్ లబ్ధిదారులపె సుమారు రూ. 20వేల కోట్ల ఆర్థిక భారాన్ని మోపేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాల్కొండ నియోజకవర్గంలో చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపు నిచ్చారు.ఈ ధర్నా కార్యక్రమం బాల్కొండ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బుధవారం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ఎల్‌ఆర్‌ఎస్ లబ్ధిదారులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఎమ్మెల్యే కోరారు

ఏటీఎంలలో చోరికి పాల్పడిన పాత నేరస్తుడి అరెస్ట్

- మూడు కేసుల్లో 30 వేల నగదు సీజ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పలు ఏటీఎం సెంటర్లో అమాయక ప్రజలను మోసం చేసి, వారి ఏటీఎం మార్చి తర్వాత డబ్బులను డ్రాచేసుకొని మోసం చేస్తున్న గద్దమీది రమేష్ ఏ.రాజుది కామారెడ్డి జిల్లా, భిక్కనూర్ మండలం, జంగం పల్లి గ్రామం. ఇటీవల నగరంలోని వన్ టౌన్ పరిధిలోని మూడు ఏటీఎంలను మార్చి చోరికి పాల్పడినట్లు వెల్లడించారు. ఏటీఎంలో నమ్మించి చోరీకి పాల్పడిన పాత నేరస్థుడిని అరెస్టు చేసి మూడు కేసుల్లో 30వేల నగదు సీజ్ చేసినట్లు ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ విజయ్ బాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు

ఉప్లూర్‌లో హైమాక్స్ లైట్లు ప్రారంభం



హైమాక్స్ లైట్లను ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామంలో జడ్పిటిసి సభ్యురాలు పెరుమాండ్ల రాధా రాజా గౌడ్, ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి అందించిన నిధులతో ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్లను మంగళవారం ప్రారంభించారు. మాజీ సర్పంచ్ బద్దం పద్మ చిన్నారెడ్డి , ఎంపీటీసీ సభ్యుడు పిప్పేర అనిల్ రెడ్డి, కమ్మర్ పల్లి సింగిల్ విండో చైర్మన్ రేగుంట దేవేందర్ కోరిక మేరకు గ్రామంలో రెండు చోట్ల హైమాక్స్ లైట్స్‌ను జడ్పిటిసి సభ్యురాలు రాజ గౌడ్, లోలపు గౌతమి ఏర్పాటు చేయించారు. అందులో భాగంగా శ్రీ బాల రాజేశ్వర స్వామి దేవాలయం వద్ద, గ్రామం లోపల కోషేర్ వద్ద ఈ హైమాక్స్ లైట్స్ ను బిగించారు. వాటిని గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామస్తుల సమక్షంలో ప్రారంభించారు. నిధులు కేటాయించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. హైమాక్స్ లైట్ల ఏర్పాటుకు కృషిచేసిన మాజీ సర్పంచ్ బద్దం పద్మ చిన్నారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పిప్పేర అనిల్ రెడ్డి, కమ్మర్ పల్లి సింగిల్ విండో చైర్మన్ రేగుంట దేవేందర్‌ను అభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు బద్దం రమేష్ రెడ్డి, సభ్యులు సుంకరి విజయ్ కుమార్, కమ్మరి నరేష్, టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అవారి మురళి, నాయకుల అవారి గంగారెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్న బిల్డర్స్

- బిఎల్‌టియు రాష్ట అధ్యక్షులు -దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో దశాబ్దాలుగా భవన నిర్మాణ రంగంలో సేవలందిస్తున్న భవన నిర్మాణ కార్మికుల ఉపాధిని దెబ్బతినేలా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బిల్డర్స్ ఇతర రాష్ట్రాల నుండి కార్మికులను అతి తక్కువ కూలికి తెచ్చి స్థానిక కార్మికుల కడుపులు కొడుతున్నారని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ (బీఎల్‌టియు) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో పేరుమోసిన ఒక బిల్డర్స్ కంపెనీ యజమాని స్థానికులకు పని ఇవ్వకూడదని తీర్మానించిన బిల్డర్స్ కంపెనీకి భవన నిర్మాణ కార్మికుల నుండి చట్టబద్ధమైన తీవ్రమైన ప్రతిఘటన ఉంటుందని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రోడ్లు భవనాల అతిథి గృహంలో జరిగిన బహుజన భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం నగర కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బ్యాంకుల నుండి కోట్లాది రూపాయల రుణాల ద్వారా పొంది వ్యాపారం చేసే రియల్ ఎస్టేట్ బిల్డర్ వ్యాపారులు యూపీ, బిహార్, మహారాష్ట్రల నుండి కార్మికులను తెచ్చి వెట్టి చాకిరీ చేయిస్తున్నారని తెలిపారు. స్థానిక భవన నిర్మాణ కార్మికులు బిల్డర్స్ శ్రమ దోపిడికి వ్యతిరేకంగా పోరాడుతారు కాబట్టి స్థానికులకు పని ఇవ్వడంలేదన్నారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో భవన నిర్మాణ కార్మికులు ఇతర ప్రాంతాలకు, గల్ఫ్ దేశాలకు వలసలు వెల్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిఎల్ టియు జిల్లా అధ్యక్షులు కె.మధు, ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, బహుజన భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం నాయకులు టి.రాజు, సురేందర్ యాదవ్, బిఎల్‌టియు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి గంగ శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు జి.యాదయ్య, నాయకులు కె.సతీస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తాహెర్‌బిన్ హందాన్

- ఆయన్ను కలిసిన జిల్లా నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

హైదరాబాద్‌లో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ గా నియమింపబడిన తర్వాత తాహెర్ బిన్ హందాన్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ కార్యాలయంలో ఆయనను జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికల నర్సారెడ్డి, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి పనులు పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణత-కమ్మర్‌పల్లి

మండలంలోని హస కొత్తూర్, చౌట్ పల్లి గ్రామాల్లో కొనసాగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. హస కొత్తూర్ గ్రామంలో గండి ముందట గుట్ట వద్ద, చౌట్ పల్లిలో పులిమెట్టు గుట్ట వద్ద కొనసాగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన కూలీల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసి స్వయంగా హాజరు తీసుకున్నారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్నందున పని ప్రదేశంలో కూలీలు సేద తీరేందుకు సౌకర్యాలు కల్పించాలని, ఎండల బారిన పడకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. కొలతల ప్రకారం పని వివరాలను పక్కాగా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కూలి డబ్బులు సక్రమంగా బ్యాంకు ఖాతాలో పడుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కూలీలకు సూచించారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, మెట్లు, తదితరులు ఉన్నారు.

మూడు ఉద్యోగాలకు అర్హత సాధించిన యువకుడు



నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన కనుగుల జైపాల్ గురుకుల రిక్రూట్‌మెంట్‌లో భాగంగా వెలబడిన ఫలితాల్లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైనట్లు గ్రామస్తులు తెలిపారు. జూనియర్ లెక్చరర్, పిజిటి, టీజిటి ఉద్యోగాలు సాధించారు. ఉస్మాని యా యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లీష్, బీఎడ్ ఫారెన్ లాంగ్వేజ్, ఉస్మానియా యూనివర్సిటీ ఎంఏ చేసి ప్రస్తుతం నిజామాబాద్ మైనార్టీ గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో లెక్చరర్ ఉద్యోగం చేస్తున్నారు. కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన యువకుడు మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి గ్రామానికి గుర్తింపుతే వడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల క్యాలెండర్ పంపిణీ



క్యాలెండర్ పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగ రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ శ్రద్ధానంద్ గంజ్‌లో పసుపు రైతులతో కొద్దిసేపు ముచ్చట ్ంచివారికి కేంద్ర ప్రభుత్వం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంక్షేమ పథకాల క్యాలెండర్, మన సంకల్పం వికసిత్ భారత్ ప్రతులను పసుపు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మాస్టర్ శంకర్ మాట్లాడుతూ కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతన్నల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. పసుపు బోర్డు ప్రకటించి రైతన్నలను ఆదుకుంటుందని తెలిపారు. మరోసారి నిజామాబాదు ఎంపీగా అర్వింద్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం అన్నారు. కార్యక్రమంలో పసుపు రైతులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను సమానంగా చూడాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపెర్వైజర్ ప్రియదర్శిని

నవతెలంగాణ-సిరికొండ

బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో మండలకేంద్రంలోని రైతు వేదికలో ఐసీడీఎస్ సూపెర్వైజర్ ప్రియదర్శిని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీడబ్ల్యూఓ అధికారి రసూల్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయిలను రక్షించాలని, చదివించాలని అన్నారు. లింగ వివక్ష చూయించకుండా సమాన హక్కులు కల్పించాలని తెలిపారు. ఆడ పిల్లలను అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. భ్రూణహత్యలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అమ్మాయిలని పుట్టానిద్దాం.. ఎదగనిద్దాం.. చదువుకోనిద్దాం.. అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మి ప్రసాద్, ఎమ్ఆర్వో రవీందర్ రావ్, సీడీపీఓ స్వర్ణలత, డీపీవో చైతన్య, గ్రేడ్-1 సూపర్వైసర్ ప్రియదర్శిని, సవిత, పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ రాంబాబు, పోలీస్ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సాలూర తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా పాలన కౌంటర్

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తులు అందజేయడానికి తహసీల్దార్ రమేష్ ప్రత్యేక ప్రజాపాలన సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అర్హత కలిగిన 200 యూనిట్ల విద్యుత్ వాడకం దారులు ఉచిత విద్యుత్‌పై దరఖాస్తు చేసుకోవడానికి, సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు పొందడానికి ప్రభుత్వం మండల కేంద్రాల్లో ప్రత్యేక సేవాకేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ రమేష్ తెలిపారు.

పార్టీ కార్యాలయ నిర్మాణానికి అనుమతినివ్వాలి : టీడీపీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

టీడీపీ పార్టీ కార్యాలయ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని టిడిపి నాయకులు కోరారు. తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యాదాగౌడ్ ఆదేశాను సారం మంగళవారం కలెక్టర్ కార్యాలయ ంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ కు టిడిపి నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ 1996లో తెలుగుదేశం పార్టీ హయాంలో పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం అప్పటి మంత్రి హరి కృష్ణ స్థలం కేటాయించి శిలాఫలకం వేశారన్నారు. అనివార్య కారణాల వలన పార్టీ కార్యాలయ నిర్మాణం చేయలేదని తెలిపారు. ఇప్పుడు తిరిగి నిర్మించుకుంటామని, దానికి తగిన అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట టిఎన్ టియుసి నాయకులు కోయేడీ నర్సింలు, అర్బన్ సీనియర్ నాయకులు మల్లరెడ్డి, లవంగ రాజు, స్వామి, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఆదేశాల మేరకు మంగళవారం నాడు మద్నూర్ మండలం లోని అంతాపూర్ గ్రామంలో5 లక్షల నిధులతో సీసీ రోడ్ నిర్మాణ పనుల శంకుస్థాపన చేసినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్నూర్ మాజి సర్పంచ్ దారస్ వార్ సాయిలు , సీనియర్ నాయకులు హన్మండ్లు స్వామి , కొండావార్ గంగాధర్, రమేష్ వట్నాల్ వార్ , కొండవార్ రాజు, ఈరన్న అంతపూర్ గంగాధర్ , కాంగ్రెస్ పార్టీ అంతపూర్ గ్రామ అధ్యక్షుడు దత్తు , శంకర్ పటేల్ , అంతపూర్ తాజా మాజీ సర్పంచ్ సుగుణ బాయి రాజు , అఖిల్ , అంకుష్ పటేల్ ఇతరులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పలు గ్రామాలకు చెందిన కళ్యాణలక్ష్మీ చెక్కులను స్థానిక మండల ప్రజా ప్రతి నిధులు ఎమ్మెలే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం లబ్దిదారులకు అందజేశారు. వజ్రఖండి మాజీ సర్పంచ్ కాంగ్రెస్ సీనీయర్ నాయకులు సంజీవ్ పటేల్ పంపిణీ చేపట్టి మాట్లాడారు. మండలంలోని నాగల్ గావ్ , వజ్రఖండి, జుక్కల్, పెద్ద ఎడ్గి , ఖండేభల్లూర్, పెద్ద గుల్లా , తో పాటు వివిధ గ్రామాలకు చెందిన 70 మంది లబ్దిదారులకు పంపిణీ చేసినట్టు తెలిపారు.


చెక్కులు అందజేస్తున్న నాయకులు

సొసైటీ అవిశ్వాసం వాయిదా

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని చిన్న కొడప్ గల్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ నారాయణరెడ్డి పై సంఘ సభ్యులు మంగళవారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పటికీ కోర్టు ఉత్తర్వుల మేరకు వాయిదా పడింది. అంతకుముందు ఉమ్మడి జిల్లాల జిల్లా కో ఆపరేటివ్ అధికారి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో పోలీసుల కట్టుదిట్ట భద్రతల మధ్య మూడు గంటలపాటు అవిశ్వాస తీర్మానం కొనసాగగా చైర్మన్ గైర్హాజరైనప్పటికీ వైస్ చైర్మన్ తో పాటు 11 మంది సంఘ సభ్యులు హాజరై చైర్మన్ నారాయణరెడ్డి , వైస్ చైర్మెన్ గోకన్ సాయ గౌడ్‌కు విరుద్ధంగా 10 మంది సంఘ సభ్యులు చేతుల పైకి ఎత్తి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. చైర్మన్ కోర్టును ఆశ్రయించడంతో అవిశ్వాస తీర్మానాన్ని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్రీనివాసరావు కోర్టుకు నివేదించనున్నారు. నారాయణరెడ్డి గతంలో సహకార సంఘం సెక్రటరీగా బాధ్యతలు కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ విధేయులుగా కొనసాగారు. ఉద్యోగ విరమణ అనంతరం నాలుగు సంవత్సరాల క్రితం నిర్వహించిన సొసైటీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీ లో చేరి సొసైటీ ఎన్నికలకు గాను తన వర్గం నుండి కొంత మంది ప్యానెల్‌తో చేసుకుని ఎన్నికలకు సిద్ధమయ్యారు. నారాయణరెడ్డి అవినీతి కార్యకలాపాలకు ఎండగట్టాలని సదుద్దేశముతో అదే బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి అసమ్మతితో సింగిల్ విండో ఎన్నికకు ఆయన కొంతమందితో ప్యానెల్ తయారు చేసుకుని సిద్ధమవడంతో అప్పట్లో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే స్పందిస్తూ నారాయణరెడ్డి ప్యానెల్‌కు మద్దతు ఇవ్వడంతో వెంకట్ రెడ్డి పై పార్టీ క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆదేశించారు. నాటినుండి వెంకట్‌రెడ్డి వర్గీయులు నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లపై అసంతృప్తి తో పార్టీలో ఇమిడి లేకపోయి తమ అవకాశాల కోసం ఎదురుచూస్తూ కొనసాగారు. చివరకు ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలలో వెంకటరెడ్డి వర్గీయులు కాంగ్రెస్ పార్టీలో చేరి కొడప్‌గల్ సింగిల్ విండో పరిధిలో 850 పైచిలుకు ఓట్లు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావుకు వేయించడంతో ఆయన విజయం సుగగమైంది. ఈ విధముగా చైర్మన్ నారాయణరెడ్డి అవినీతి కార్యక్రమాలను ఎండగట్టాలనే సదుద్దేశంతో అశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినట్లు వారు పేర్కొన్నారు. కాగా కోర్టు తీర్పు నేపథ్యంలో అవిశ్వాస తీర్మానం వాయిదా పడ్డట్టయింది. ఈ కార్యక్రమంలో మురళీధర్ అసిస్టెంట్ రీజనల్ ఆఫీసర్ (పిట్లం బ్రాంచ్), ప్రశాంత్ రెడ్డి అసిస్టెంట్ రీజనల్ ఆఫీసర్ కామారెడ్డి, భూమయ్య అసిస్టెంట్ రీజనల్ ఆఫీసర్ కామారెడ్డి, అబ్దుల్ అలీమ్ జూనియర్ ఇన్స్‌పెక్టర్, సంఘ సీఈవో హన్మగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.


అవిశ్వాసం సందర్భంగా చేతులెత్తిన సభ్యులు

నేటి భేటీ బచావో.. బేటి పడావో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఐసిడిఎస్ ఎడపల్లి మండల పర్యవేక్షకురాలు విజయ రాణి

నవతెలంగాణ-ఎడపల్లి

ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించే బేటి బచావో... బేటి పడావో కార్యక్రమాలతోపాటు అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ ఎడపల్లి మండల పర్యవేక్షరాలు విజయ రాణి మంగళవారం తెలిపారు. ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్, సంబంధిత శాఖ అధికారులు, మండల అధికారులతో పాటు, అంగన్వాడి ఉపాధ్యాయులు , కార్యక్రమానికి హాజరవుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అధికారికంగా అంతర్జాతీయ నిర్వహిస్తున్నట్లు, తెలిపారు. ప్రజాప్రతి నిధులు, అధికారులు, ఐసిడిఎస్ అధికారులు హాజరై కార్యక్రమాలను విజయ వంతం చేయాలని ఆమె కోరారు..

మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చూడాలి

- నవతెలంగాణ కథనం నేపథ్యంలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన అధికారులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు మాల్ కాపీయింగ్ సాగుతు న్నందున "ఇంటర్ పరీక్షలో అంతా చూచి రాతే..?" శీర్షికతో "నవతెలంగాణ" దినపత్రికలో ప్రచురించిన కథనం పట్ల అధికారులు స్పందించారు. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ మంగళవారం మండలంలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాల్ ప్రాక్టీస్ జరగకుండా పగడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని, విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని చీఫ్ సూపర్డెంట్ శ్రీనివాస్ కు ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని, రికార్డులను పరిశీలించారు. ఈ పరిశీలనలో జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం, పరీక్షా విభాగం అధికారులు ఉన్నారు.


తనిఖీ చేస్తున్న అధికారులు

జై గౌడ ఉద్యమం జిల్లా కమిటీ ఎన్నిక


ఎన్నికైన జిల్లా కమిటీ

నవతెలంగాణ-కామారెడ్డి

జై గౌడ ఉద్యమం కామారెడ్డి జిల్లా అధ్యక్షునిగా రంగోల మురళి గౌడ్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాదులో ని ఉస్మానియా యూనివర్సిటీ లో జై గౌడ్ ఉద్యమ జాతీయ కమిటీ ప్లీనరీ సమావేశంలో జై గౌడ ఉద్యమ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వట్టికూడి రామారావు గౌడ్ ఆధ్వర్యంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. జై గౌడ్ ఉద్యమ కమిటీ కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా ప్రశాంత్ గౌడ్, ఉట్నూరు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా అంకన్నగారి శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శిగా రామాగౌడ్, జై గౌడ ఉద్యమం రాష్ట్ర అధికార ప్రతినిధిగా అంకన్న గారి నాగరాజుగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా ఎన్నికైన రంగోల మురళిగౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనను అధ్యక్షులుగా నియమించినందుకు జై గౌడ ఉద్యమం జాతీయ అధ్యక్షులు వట్టికూడి రామారావు గౌడ్, మాజీ అధ్యక్షుడు బంబోతుల లింగాగౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. గౌడ సమస్యల సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ పట్ల హర్షం


సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. మండల కేంద్రంలో గాంధీ చౌక్‌లో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డి ఆదేశాల మేరకు జుక్కల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఇంరోజ్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఇమ్రోజ్ మాట్లాడుతూ గత బి ఆర్ స్ ప్రభుత్వం 9 సంవత్సరాల కాలంలో ఎప్పుడు ఉద్యోగుల కోసం నోటిఫికేషన్ వేయకుండా నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహించి వారి జీవితాలతో చెలగాటం ఆడిందని అన్నారు. దీంతో బి.ఆర్.ఎస్ పార్టీ కి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తారని దానికోసం యువజన కాంగ్రెస్ నాయకులు ముందుండి పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ రెడ్డి కాశోజీ, జీవన్, విఠల్, బస్వరాజ్, శ్రీనివాస్, రాంసింగ్, మల్లేశం, మునీర్, ఇస్మాయిల్, బచ్చన్, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక సాంకేతికతో సాగు

- నేడు రైతు వేదికలో అవగాహన సదస్సు
- రైతులు హాజరు కావాలి : ఏవో రాజు

నవతెలంగాణ-మద్నూర్

సాగులో అత్యాధునిక సాంకేతిక విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు నేడు (బుధవారం) రాష్ట్ర ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహి ంచనుందని ఏవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11.30 గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌కు ఏర్పాట్లు చేశామని, ఉమ్మడి మద్నూర్ మండల ప్రజాప్రతినిధులు, రైతులు, మండల స్థాయి అధికారులు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. రైతులకు సాగులో వచ్చిన ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన చేపడుఉతున్నట్టు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అలాగే రాష్ట్రస్థాయి వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

నాటు బాంబు పేలిన ఇంటిని పరిశీలన

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని అన్నారం గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు నాటుబాంబు పేలి మహిళా తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. మంగళవారం ఎఫ్ డి ఓ గోపాల్ రావు, ఎఫ్ ఆర్ వో దివ్య, సిబ్బందితో కలిసి ఇంటిని పరిశీలించారు. ఇంటిలో అడవి జంతువులను వేటాడే వస్తువులు దొరకడంతో దుండగుల రవీందర్ పై కేసు నమోదు చేసినట్లు ఫారెస్ట్ అధికారి గోపాల్ తెలిపారు.


పేలుడు చోటుచేసుకున్న ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయండి

- ఇండ్లమీద ఉన్న తీగలు తొలగించి ప్రాణనష్టం వాటిల్లకుండా చూడాలి
- విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు ఏకరువు

నవతెలంగాణ-మద్నూర్

వ్యవసాయ బోర్లకు కట్టెల స్తంభాల పైనే కరెంటు తీగలు ఉండటంతో కట్టెల స్తంభాలు ఎండకు వానకు చెడిపోయి అవి విరగడంతో వైర్‌లు కింద పడి పశువులకు, రైతులకు ప్రాణాప్రాయం వాటిల్లుతుందని, అలాంటి చోట కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని మండల భారతీయ కిసాన్ సంగ్ అధ్యక్షులు చాట్ల గోపాల్ అధికారులను కోరారు. మండల కేంద్రంలో మంగళవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించగా.. పలువురు హాజరై సమస్యలు ఏకరువు పెట్టారు. చాట్ల గోపాల్ మాట్లాడుతూ ఇంటి నివాసాల పైన నుండి కరెంటు వైర్లు ఉన్నాయని, ఏదైనా పని నిమిత్తం ఇంటిపైకి వెళ్తే వైర్‌లు తగిలి విద్యుత్ ప్రమాదాలకు గురవు తున్నారని, కావున ఇండ్ల పై నుంచి వెళ్లిన వైర్‌లను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ రామకృష్ణ, చైర్పర్సన్ టెక్నికల్ మెంబర్ ఎల్ కిషన్, రాజా గౌడ్, ఫోర్త్ మెంబర్ వీరితోపాటు మద్నూర్ మండలం తో పాటు వివిధ మండలాల నుండి సబ్‌స్టేషన్‌ల వారీగా ట్రాన్స్‌కో ఇల్లు సంబంధిత సిబ్బంది భారతీయ కిసాన్ సాంగ్ వివిధ మండలాల అధ్యక్షులు కరెంటు వినియోగదారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్

దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు వికలాంగుల సంక్షేమం కోసం తమ మ్యానిఫెస్టోలో పేర్కొవాలని విజ్ఞాన్ వికలాంగుల సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్పదగ్గ ప్రసాద్ కోరారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దివ్యాంగులకు ఉచిత రైల్వే రావాణ సౌకర్యం కల్పించాలని, దివ్యాంగుల జీవిత బీమా, స్టడీ సర్కిల్, దివ్యాంగులందరికి పక్క ఇంటి స్థలం , ఇంటినిర్మాణం, ఉచిత ఆహార భద్రత సౌకర్యం, పంచాయతీ నుండి పార్లమెంటు వరకు రాజకీయ రిజర్వేషన్లు అమలు, అర్హులైన దివ్యాంగులందరికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ స్వయం పూచికతో 5లక్షల ఆర్థిక ఋణాలు, దేశ వ్యాప్తంగా 2016 దివ్యాంగుల చట్టం అమలు చేయాలని కోరారు. దేశంలో 89 లక్షల మంది దివ్యాంగ ఓటర్లు ఉంటే కనీసం 5 గురికైనా అన్ని రాజకీయ పార్టీలు నామినేట్ పార్లమెంటు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెర్కొన్న సంక్షేమ పథకాలు దివ్యాంగులకు అమలు చేయాలని కోరారు. మండలాల వారీగా సదరం శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కమిటీ వైస్ చైర్మన్ నితీష్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రంగ్యానాయక్, బంటు స్వామి, బంజ రాజు, కుర్మా వెంకట్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రసాద్


టీకాలతో గాలికుంటు నివారణ


పశువులకు గాలికుంటు నివారణా టీకాలు వేస్తున్న పశువైద్యులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పెద్దకొడప్ గల్ మండలంలోని వడ్లం గ్రామంలో మంగళవారం రోజున పశు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువులకు సోకే తీవ్రమైన అంటువ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ప్రదానమైందని, వ్యాధిని నిరోధించేందుకు, పశువులకు సోకకుండా ముందస్తుగా ఇస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని కోరుతున్నారు. పశువైద్య సిబ్బంది గ్రామాలకు చేరుకొని గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ సురేష్, గోపాలమిత్ర గౌస్, మాజీ ఎంపీటీసీ శామప్ప, సంజు పటేల్, దత్తు, నారాయణ, రైతులు పాల్గొన్నారు.

పరీక్ష అట్టలు పంపిణీ


పరీక్ష అట్టలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

నవతెలంగాణ-కామారెడ్డి

బీబీపేట్ మండలం యాడవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 11 మంది విద్యార్థులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా వైస్ చైర్మన్ అంకన్నగారి నాగరాజ్ గౌడ్, మండల చైర్మన్ నాగేశ్వర్ తో కలిసి పరీక్ష అట్టలను, స్నాక్స్ మంగళవారం పంపిణీ చేశారు. నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇష్టపడి చదివి పరీక్షలు రాస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. భయం వీడి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని అనుకున్న లక్ష్యాన్ని చేరాలంటే సాధన అవసరమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని సాయంత్రం పూట ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న తరుణంలో వారి ఆరోగ్యాలు పరిరక్షించేందుకు చదువుపై దృష్టి నిలిపేందుకు సాయంత్రం వేళ విద్యార్థులకు అల్పారం అందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టి ఆయా పాఠశాలలో అందిస్తున్నామన్నారు. రెడ్ క్రాస్ మండల చైర్మన్ బాశెట్టి నాగేశ్వర్, వైస్ చైర్మన్ పిడుగు స్వామీ వీరి సహకారంతో పరీక్ష అట్టలు, స్నాక్స్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి ఉపాధ్యాయులు శ్రీనివాస్, మహేష్, వైస్ చైర్మన్ పిడుగు స్వామీ ,మండల సభ్యులు నందకుమార్ పాల్గొన్నారు.

చేతికొచ్చిన జొన్నపంట

- వినియోగం పెరగడంతో
- ప్రతేడాది పెరుగుతున్న ధర

నవతెలంగాణ-జుక్కల్

మండలంలో తెల్ల జొన్న పంటను రబీ సీజన్‌లో సాగు చేస్తుంటారు. ప్రస్తుతం జుక్కల్ మండలంలో జొన్న పంట సాగువిస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం కోతకు వచ్చింది. పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. రైతుకు ఈ ఏడు మంచి ధర లభించే అవకాశం ఉన్నట్టు వ్యాపారులు పేర్కొంటున్నారు. మార్కెట్‌లో జొన్నలకు డిమాండ్ పెరగడంతో ధర పెరుగుతున్నట్టు సమాచారం. ఒకానొక దశలో రిటైల్‌లో కేజీ 80 రూపాయలు పలికింది. క్వింటాల్ 8వేలు అన్నమాట. ఆరోగ్య రీత్యా ఎక్కువ మంది జొన్న రొట్టెలకు అలవాటు పడుతుండటంతో డిమాండ్ పెరిగింది.

తక్కువ ఖర్చుతో సాగు

రబీ సీజన్ లో పండించే జొన్న పంటకు విత్తనాలు వేసిన నాటి నుంచి కోతకు వచ్చే వరకు తక్కువగా పెట్టుబడి పడుతుంది. ఎకరాకు పదివేల పైచిలుకు ఖర్చు మాత్రమే వస్తుంది. ఒక్కసారి మొలక మొలిస్తే ఇక కోతకు వచ్చే వరకూ ఖర్చు అవసరం ఉండదు. ఎండ పెరిగినా మొలక పెరగడం ఆగదు. వర్షం వస్తే మాత్రం కంకి నల్లగా మారి రొట్టె రంగు మారి రుచి తగ్గుతుంది.


కోతకు వచ్చిన జొన్న పంట

పెరిగిన ధర

కొత్త జొన్నలు క్వింటాల్ కు ఆరు వేల లోపు అందుబాటులో ఉన్నాయి. సాగు పెరిగి పట్టణాలకు రైతులు తరలించి హెూల్ సెల్ వ్యాపారులకు నేరుగా అమ్మేస్తుండటంతో రైతులకు ధర గిట్టుబాటు అవుతుంది.

నీటితడి లేని జొన్న రొట్టే టేస్ట్ వేరు

నీరు పెట్టకుండా పండించిన జొన్నలను మర పట్టించి రొట్టె చేస్తే దారి రుచి బాగుంటుంది. నీరు పెట్టిన జొన్న రొట్టెలను తిన్న మంచిదే కానీ టేస్ట్‌లో కొంత వేరైటిగా మారి ఉంటుంది. అయితే రైతులు నేరుగా పట్టణాలకు తరలించి విక్రయాలు చేపడుతుంటారు. ఇక్కడి వారు పట్టణాలకు బతుకు దెరువుకు వెళ్లిన వారు అక్కడ పరిచయస్తులకు జుక్కల్ నుండి కొనుగోలు చేసి రెట్టింపు ధరతో పట్టణాలలో అమ్మి లబ్ది పొందుతు వ్యాపారం కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీటీసీ

నవతెలంగాణ-రెంజల్



కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలతో ప్రజలకు దగ్గరవుతున్న సందర్భంగా మండలంలోని తాడి బిలోలి ఎంపీటీసీ చింతకుంట లక్ష్మి, లింగారెడ్డి, మాజీ మంత్రి పి. సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువాను కప్పుకున్నారు. వారితో పాటు తాడిబిలోలి గ్రామానికి చెందిన పి.నాగరాజ్, నగేష్, కే. అబ్బయ్య, కే.పోశెట్టి, సిహెచ్.సాయిలు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో అంతిరెడ్డి రాజిరెడ్డి, మోబిన్ ఖాన్, జి సాయ రెడ్డి, జావీదొద్దీన్, ధనుంజయ్, శనిగరం సాయి రెడ్డి, కృష్ణారావు, సగ్గు వెంకటి, నారాయణ, విజయ్, ఎల్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు, వార్డు సభ్యులు

నవతెలంగాణ-బోధన్



సాలుర గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తలు మంగళవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యులు నబ్బు, కందిమల్ శోభ, టిఆర్ఎస్ కార్యకర్తలు కందిమల్ల భూమయ్య, నిగ్గ లక్ష్మణ్, శివాలయం కమిటీ చైర్మన్ ధడెన్ శంకర్ పటేల్ చేరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, కాంగ్రెస్ నాయకులు అల్లె రమేష్, సొక్కం రవి, భయన్ సురేష్ తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మిసిమి విద్యార్థులు ఎంపిక



హ్యాండ్‌బాల్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగవారం ఆర్మూర్ నవ్య భారతి గ్లోబల్ హై స్కూల్లో జూనియర్ బాలుర విభాగంలో హ్యాండ్ బాల్ ప్రాబబుల్ జట్ల ఎంపిక నిర్వహించారు. ఈ పోటీల్లో మిసిమి పాఠశాల విద్యార్థులు శశ్వాంత్, రవి చరణ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి నిజామాబాద్ జిల్లా జట్టుకు ఎంపిక అయ్యారు. వీరు వరంగల్ జిల్లాలో ఈ నెల 8 నుండి జరగబోయే 45 వ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల కరస్పాండెంట్ బాలి రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయుడు సంజీవ్‌ను కరస్పాండెంట్ బాలి రవీందర్ , ప్రధానోపాధ్యాయులు కృష్ణ చైతన్య, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌ను సన్మానించిన నాయకులు



తాహెర్‌బిన్‌ను కలిసిన సునీల్‌కుమార్, వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ నూతన ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా ఎన్నికైన తాహెర్ బిన్ హందాన్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించినారు. వారితోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

విరాళ దాతకు సన్మానం



దాతను సన్మానిస్తున్న నిర్మాణబాధ్యులు, తదితరులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో నిర్మిస్తున్న 'ఇండోర్ స్టేడియం' నిర్మాణం కోసం మండల కేంద్రానికి చెందిన కొమ్ముల సంకీర్త్ రెడ్డి (యూఎస్ఏ) తనవంతు సాయంగా రూ.50 వేల రూపాయలను మంగళవారం క్రీడా నిర్మాణ బాధ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా విరాళ దాతను నిర్మాణ బాధ్యులు, పలువురు క్రీడాకారులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా కబడ్డీ అసోషియేషన్ ఉపాధ్యక్షులు కె.గంగాధర్ మాట్లాడుతూ.. ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం ప్రముఖులు, దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.గంగాధర్, రిటైర్డ్ ఉద్యోగస్తులు నునుగొండ అంజయ్య, పుష్పానాథ్ రెడ్డి, పల్లికొండ గోపీనాథ్, టి.సాయన్న, మోతే గంగారెడ్డి, గద్దల గంగారాం, ముస్కు మోహన్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-భీంగల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలలో భాగమైన గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలను ప్రవేశపెట్టిన సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొద్దుల స్వామి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిందే చేస్తుందని ఇందుకు నిదర్శనమే ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజాప్రభుత్వంగా ముందుకెళ్తుందని తెలిపారు. గత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో స్థలం కలిగి ఇల్లు లేని వారికి ఇల్లు నిర్మించుకునేందుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కుంట రమేష్, జేజే నరసయ్య, గోపాల్ నాయక్, నాగేంద్ర, సుంకరి సురేష్, శివరాం నాయక్, రవి, రహమాన్, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు (ఇష్టా అనుబంధం) సమ్మెకు పిడిఎస్‌యూ విద్యార్థి సంఘం తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా పిడిఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఏర్పడినప్పటి నుంచి వివిధ సెక్షన్లలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 272 మంది పనిచేస్తున్నారని , వారికి సరైన జీతాలు ఇవ్వటం లేదని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగులందర్నీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు దేవిక, రవీందర్,అక్షయ్, హమ్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి డబ్బులు స్వాహా

- ప్రయివేట్ ఉద్యోగి, నాయకులకు , ఇంట్లో ఉన్న మహిళలకు కూలి అందజేత
- హాజరు వేస్తే సగం సగం కూలి
- పనులు చేసిన వారికి సరిగా డబ్బులు రాక ఇబ్బందులు



పనులు చేస్తున్న కూలీలు

నవతెలంగాణ-మాక్లూర్

ఒక వైపు కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నీరుగార్చేలా నిధులు తగ్గిస్తూ, అనేక కొర్రీలు పెడుతూ ఉపాధి పనులను దూరం చేసేందుకు యత్నిస్తుండగా.. మరో వైపు స్థానిక అధికారులు అక్రమాలకు పాల్పడుతూ పని చేయని వారికి సైతం కూలీ ఇప్పిస్తూ.. పని చేసిన వారి శ్రమదోపిడీకి పాల్పడుతున్నారు.

తప్పుడు మస్టర్లు, పనుల్లో అక్రమాలు, వేతనాల్లో కోత వంటి వాటికి ఉపాధి హామీ చట్టం చిరునామాగా మారుస్తున్నారు. ఉపాధి కూలీల హాజరు, పనుల వివరాల నమోదులో ఉన్న లొసుగులు అనేక అక్రమాలకు తావిచ్చాయి. తక్కువ మంది పనులు చేసినా ఎక్కువ మందికి మస్టర్లు వేసి వేతనాలు పక్కదారి పట్టించారు. కందకాలు, ఊటకుంటల తవ్వకం పనులు ఎక్కువ కొలతలతో రికార్డు చేసి అదనంగా బిల్లులు డ్రా చేయడం, హరితహారంలో తక్కువ గుంతలు తీసి ఎక్కువ నమోదు చేయటం, కొన్ని ప్రాంతాల్లో పాత పనులను కొత్తగా చేసినట్లు చూపటం ద్వారా పెద్ద మొత్తంగా నిధులు దండుకున్నారు.

ఈ అక్రమాలు ఏమాత్రం బయటకు పొక్కకుండా సాంకేతికంగా జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ బయటపడుతూనే ఉన్నాయి. ఇలాంటి సంఘటనే మండలంలోని కల్లెడ గ్రామంలో ఉపాధి హామీలో చోటు చేసుకుంది.

కూలి చేయకుండానే హాజరు, డబ్బులు..

కల్లెడ గ్రామంలోని ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ అత్యుత్సాహం ప్రదర్శించి కూలి చేయకుండానే హాజరు వేసి వారికి డబ్బులు ఇచ్చిన ఘటన గ్రామంలో ఆశ్చర్యానికి గురి చేస్తుంది. కూలి చేసిన వారికే సరిగ్గా డబ్బులు రాక ఆందోళన చెందుతుంటే చేయని వారికి ఎలా వస్తున్నాయని అంటున్నారు.

ప్రయివేట్ ఉద్యోగికి, రాజకీయ నాయకులకు హాజరు

నిత్యం కూలికి వెళ్ళే వారితో పాటు ప్రయివేట్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తికి, రాజకీయ నాయకులకు, ఇంటివద్ద ఉన్న మహిళలకు హాజరు వేసి డబ్బులు ఇప్పించారు.

ఆరుగురు పని చేస్తే పది మందికి పంపిణీ

ఒక గ్రూపులో ఆరుగురు ఉపాధి హామీలో కూలి పని చేస్తే, వారం తరువాత మరో నలుగురి పేర్లు అందులో రాసి ఆరుగురు చేసిన పనిని పది మందికి పంచుతున్నారు. దీనితో కూలి చేసిన వారికి అన్యాయం జరుగుతుంది.

సగం డబ్బులు ఇవ్వాలి ఒప్పందం..

ఉపాధిహామీలో కూలి పనులకు రాకుండానే హాజరు వేసిన వ్యక్తికి సగం డబ్బులు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకొని హాజరు వేస్తున్నారు. ఇంట్లో ఉంది సగం డబ్బులు పొందుతున్నారు. వారితో పాటు హాజరు వేసిన వ్యక్తి కూడా ఆదాయం పొందుతున్నారు. ఈ వ్యవహారం గత సంవత్సరం 2023 జూన్ నుంచి డిసెంబర్ వరకు కొనసాగిందని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పరిశీలిస్తున్నాం..

ఎంపిడిఓ క్రాంతి.

కల్లెడ గ్రామంలోని ఉపాధి హామీపై ఫిర్యాదులు వచ్చాయి. దానిపై పరిశీలిస్తున్నాం. అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటాం.

మాశెట్టి నర్సయ్యకు పండిత్ జవహర్ లాల్ నెహ్రూ ఎక్సలెన్స్ అవార్డు

నవతెలంగాణ-బోధన్



నర్సయ్యను సన్మానిస్తున్న పలువురు

బోధన్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మాశెట్టి నరసయ్య గుప్తా చేసిన సేవలను గుర్తించి ఆదివారం హైదరాబాద్ లోని హరిహర కళాభవన్‌లో సర్ సివి రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో ఆయనకు పండిత్ జవహర్ లాల్ నెహ్రూ ఎక్స్ లెన్స్ అవార్డును అందజేశారు. 28వ ఉగాది మహోత్సవ సువర్ణ ఘంట కంకణ గోల్డ్ మెడల్స్ అవార్డుల సంబరాలలో భాగంగా ఆయనకు ఈ అవార్డును అందించినట్లు మాశెట్టి నరసయ్య గుప్తా తెలిపారు. తాను గత కొన్ని సంవత్సరాలుగా లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది తెలిపారు. నిరుపేదల అవసరాలకు, వివాహాలకు తన వంతు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని, అవార్డు అందజేసిన ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని దుర్గ నగర్ తండాలో టీఎస్ డబ్ల్యూ ఆర్డిసిడబ్ల్యూ నిజామాబాద్ ఎన్ఎస్ఎస్ యూనిట్ శీతాకాల ప్రత్యేక శిబిరం మంగళవారం ప్రారంభమైనది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ కే. లావణ్య మాట్లాడుతూ ఓటు హక్కును అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. రక్తదానం యొక్క ప్రాముఖ్యత, పచ్చదనము పరిశుభ్రత వలన కలిగే లాభాలు, ప్రతి ఒక్క అమ్మాయి చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, బాల్యవివాహాల నిర్మూలన గురించి గ్రామస్తులను చైతన్య పరిచారు. 13 సంవత్సరాల లోపు అమ్మాయిలకు హెచ్పివి వ్యాక్సిన్ భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ నివారణ కొరకు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. రక్తదానం గురించి గ్రామస్తులను చైతన్యం చేయాలనీ సూచించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ గ్రామ ప్రజలకు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై అవగాహన కల్పించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. వారం రోజులపాటు గ్రామంలో జరిగే ఎన్ఎస్ఎస్ కార్యక్రమం వివరాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నడిమెట్ల స్వాతి, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎస్ పద్మమ్మ ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం. సరిత, అధ్యాపకులు డి. సుమలత, పి. శ్వేత, విడిసి మెంబర్స్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

బంజారాహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో జి జి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతి బిసి నాయకుడు, ట్రాన్స్ పోర్ట్ బిసి వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. యావత్తు తెలంగాణ బిసి వర్గానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లపుడూ అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీ. జే.సాయినంద్ పాల్గొన్నారు

నేడు ఆధునిక, సాంకేతిక విధానాలపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-ముప్కాల్

ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక నూతన విధానాన్ని అమలు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన పద్ధతులను రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కలిగేలా వీడియో కాన్ఫరెన్స్ విధానంతో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమం ప్రారంభించనున్నారని తెలిపారు. సీఎంతోపాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు, సొసైటీ చైర్మన్లు, సెక్రటరీలు, రైతు సంఘం నాయకులు పాల్గొనాలని కోరారు.

డిచ్‌పల్లి: రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ దృశ్య శ్రవణ విధానం ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన కార్యక్రమం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని మండల వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాప్రతినిధులకు రైతులకు, మండల స్థాయి అధికారులకు మండల పరిషత్ అధికారి, తహసిల్దార్, హార్టికల్చర్ ఆఫీసర్ వెటర్నరీ ,అసిస్టెంట్ సర్జన్, నీటిపారుదల శాఖ ఇంజనీర్ విద్యుత్ శాఖ ఇంజనీర్ ,వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ, ప్రాథమిక సహకార సంఘం సీఈవోలు హాజరు కావాలని కోరారు. మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉంటుందని తెలిపారు.

నటరాజ నృత్యానికేతన్ చిన్నారులకు ప్రశంసాపత్రాలు

నవతెలంగాణ-ఆర్మూర్

మహాశివరాత్రి సందర్భాన్ని పురస్కరించుకొని కామారెడ్డి లోని కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం సనాతన సంస్కృతి సంస్థ నిర్వహించిన నృత్యోత్సవంలో మామిడిపల్లి చౌరస్తాలో గల నటరాజు నృత్యానికేతన్ సంస్థ నుండి 18 మంది చిన్నారులు పాల్గొన్నారు. మహానంది పురస్కారాలతో పాటు ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు నాట్య గురువు బాశెట్టి మృణాళిని తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలంలో జరిగే వేడుకలలో పాల్గొనవలసిందిగా నటరాజ నృత్యానికేతన్ విద్యార్థులకు ఆహ్వానం అందడం ఆనందంగా ఉందని వ్యవస్థాపకులు మాడవేటి నారాయణ, నాట్య గురువు మృణాళిని హర్షం వ్యక్తం చేశారు.



నృత్యోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

జాతీయ మహాసభల్లో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్



సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ యూనిటీ మహాసభలు ఖమ్మంలో జరుగుతుండగా జిల్లాకు చెందిన ప్రభాకర్, దేవారం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు నవతెలంగాణ తో మాట్లాడుతూ మూడు విప్లవ పార్టీలు ఒకే పార్టీగా ఏర్పడటాన్ని చారిత్రాత్మకంగా అభివర్ణించారు. దేశంలోని హిందుత్వం పేరుతో ముస్లిం ,గిరిజనులు, ఆదివాసీలు ,మైనారిటీలపై దాడులు చేస్తున్నారని బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని తెలిపారు.

ఇద్దరు గైర్హాజరు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ డి. శివకుమార్ శనివారం తెలిపారు. ఇంటర్ రెండవ సంవత్సరం మాథ్స్, బోటోని, పొలిటికల్ సైన్స్ మొత్తం 192 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 190 మంది విద్యార్థులు రాసారని, ఒకేషనల్ పరీక్షకు 16 మందికి అందరూ హాజరయ్యారని తెలిపారు. ఫ్లైంగ్ స్క్వాడ్ గోపాల్ టీమ్, డిఐఇఓ రఘు రాజు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

మున్నూరు కాపు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుచేయాలి

రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవన్న

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



అభివాదం చేస్తున్న మున్నూరుకాపు నాయకులు

మేనిఫెస్టోలో పెట్టి మాట ఇచ్చిన ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవన్న అన్నారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ సాధనకోసం మంగళవారం నిజామాబాద్ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండ దేవన్న, ఎండిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎర్ల రవి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ మేయర్ ఆకుల సుజాత, రాష్ట్ర యువత అధ్యక్షులు బండి సంజీవ్, గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షులు దేశెట్టి శివ, స్టేట్ సెక్రెటరీ గాండ్ల లింగం, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిన్నారెడ్డి, సెక్రెటరీ మధు సుధన్, రాష్ట్ర సలహాదారులు ఆకుల శ్రీ శైలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండ దేవన్న మాట్లాడుతూ.. మున్నూరు కాపులకు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కోసం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిందని, మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతి పత్రాలు అందజేశామని, మాట ఇచ్చినట్లుగానే ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఇది వరకే రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసుకొని జిల్లా అధ్యక్షులు బాజిరెడ్డి జగన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షలకుపైగా ఉన్నామని కార్పొరేషన్ సాధనకై సహకరించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత బీఆర్ఎస్, బీజేపి పట్టించుకోవడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, మంత్రి శ్రీధర్ బాబు మాత్రం స్టేట్ ఫైనాన్స్ ఏర్పాటుకు సహకరిస్తామని మాట్లాడడం జరిగిందన్నారు. సానుకూలంగా స్పందించిన కాంగ్రెస్ పార్టీ 64 మంది ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేశా మన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో రెండు ఎకరాల భూమి, ఐదు కోట్ల నిధులు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ గౌడ్, కొండ సురేఖ, సీతక్క లను ఇది వరకే కలిశామని తెలంగాణ ప్రభుత్వం మునురుకాపులను ఆదుకోవాలని అన్నారు.

పలు వార్డుల్లో పర్యటించిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణం లో 30,12,13 వార్డులో బీసి సెల్ పట్టణ అధ్యక్షులు దొండి రమణ మంగళవారం పర్యటించారు. నియోజకవర్గ ఇంచార్జి వినయ్ రెడ్డి సూచన మేరకు గృహజ్యోతి పథకంగురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పదని గడిచిన 60రోజుల్లోనే నాలుగు గ్యాంటీలు అమలు చేసిందని మిగిలిన రెండు గ్యారంటీలు త్వరలోనే అమలు చేస్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని ఎప్పుడు పేదలకు అండగా ఉంటామని, గత ప్రభుత్వాల లాగా నీటిమీద బుడగల లాగా మాటలు చెప్పమని ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని తెలుపుతూ పలు సూచనలు చేసినారు. కార్యక్రమంలో పింజా అభినవ్, తోపారం భగత్, కన్నం లక్ష్మణ్, గుంజల సుమన్, పసుపులనరేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | మార్చి 06, 2024 | www.navatelangana.com

ఆశ్రమానికి ఇన్వెర్టర్ అందజేత

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని అమ్మ అనాధ ఆశ్రమ నిర్వాహకురాలు వెంకటరమణమ్మ సేవలు మరువలేనివని మాజీ సర్పంచ్ స్వరూప పేర్కొన్నారు. అనాధలు, వికలాంగులకు సేవలు చేయడం గొప్ప విషయమని వికలాంగురాలైన డీ.పావని అనాథ ఆశ్రమం 2009లో ప్రారంభించిందన్నారు. ఎందరో అనాథలు, వికలాంగులను తీర్చి దిద్దారని తెలిపారు. ఆమె ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లడానికి వారి మాతృమూర్తి వెంకట రమణమ్మ విశేషంగా కృషి చేస్తుందని మాజీ సర్పంచ్అన్నారు. మంగళవారం అమ్మ అనాధ ఆశ్రమానికి కోటగిరి గ్రామానికి చెందిన తాటి రాములు మనవళ్ళు తాటి సాయిరాం, సంతోష్ ఇన్వర్టర్, బ్యాటరీ విరాళంగా అందించారు. అనాథ ఆశ్రమంలో చదువుతున్న బాల బాలికలు మిలిటరీలో ఉద్యోగాలు సాధించడం హర్షణీయమని రాములు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అంతే కాకుండా ఆశ్రమ నిర్వాహణలో చేదోడు వాదోడుగా ఉంటున్న మాజీ సర్పంచ్ స్వరూపను అభినందించారు

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



సమావేశానికి హాజరైన సిబ్బంది

మండలంలో తాగునీటి ఎద్దడి రానీయొద్దని సిబ్బందికి అధికారులు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడిన అనంతరం సిబ్బందితో అధికారులు మాట్లాడారు. తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అదే విధంగా ప్రజా పాలన దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి డివిల్పిఓ సురేందర్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శస్త్రం, శాస్త్రం, కావ్యం కావ్యానికి ఆలంబనాలు

- తెలుగు ప్రాచీన శాస్త్ర కావ్యాలు- లక్షణ
- గ్రంథాలు సమాలోచన
- అనే అంశంపై జాతీయ సదస్సు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



సదస్సులో పాల్గొన్న పలువురు

తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయన శాఖ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు, భారతీయ భాషా సంస్థ మైసూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో "తెలుగు ప్రాచీన శాస్త్ర కావ్యాలు, లక్షణ గ్రంథాలు- సమాలోచన" అనే అంశంపై రెండురోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. మంగళవారం సభాధ్యక్షులు తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షులు డాక్టర్. సిచ్. లక్ష్మణ చక్రవర్తి అధ్యక్షతన ప్రారంభోపన్యాసం ప్రాజెక్టు డైరెక్టర్ తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ ప్రసంగంతో సభలు ప్రారంభమయ్యాయి. కీలకోపన్యాసం చేసిన ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ శస్త్రం, శాస్త్రం, కావ్యం ఈ మూడు కావ్యానికి ఆలంబనాలు అన్నారు. శస్త్రంతో, శాస్త్రంతోపాటు హృదయాన్ని జోడించినవారు తెలుగు కవులు అన్నారు. విశిష్ట అధ్యక్షులుగా తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. యాదగిరి మాట్లాడుతూ.. ఇలాంటి సాహిత్యంపై ఇంకా పరిశోధనలు జరగాలని అన్నారు. ఇలాంటి సదస్సులు ఇంకా నిర్వహించాలని సదస్సు కన్వీనర్ ఆచార్య కరిమిండ్ల లావణ్య, సభాధ్యక్షులకు సూచించారు. సమావేశానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్. ఆరతి, ఆత్మీయ అతిథిగా ప్రొఫెసర్ డాక్టర్ పి. కనకయ్య హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు.మొదటి సమావేశం ప్రొఫెసర్ సాగి కమలాకర శర్మ అధ్యక్షతన ప్రారంభమైంది. డా. కె.ఎస్.వి.వి. సూర్య నారాయణ మూర్తి, శాస్త్ర కావ్యాలు - యోగ శాస్త్రం అనే అంశంపై ప్రసంగిస్తూ యోగ శాస్త్రానికి ఉన్న లక్షణాలను తెలుపుతూ ప్రతి వ్యక్తి కూడా సామాజిక మాధ్యమాలకు కేటాయించిన సమయంలో యోగ చేస్తే ఎంతో ఆరోగ్యంగా ఉండడానికి అవకాశం ఉందని ఉపదేశమిచ్చారు.డా. గోలిపెంచల ప్రసాద్ ప్రసంగిస్తూ.. తెలుగు కావ్యాలైన పరమయోగి విలాసం, ఆముక్త మాల్యద వంటి ప్రబంధాలలో ప్రస్తావించబడిన వైద్య శాస్త్ర అంశాలను గురించి తెలియజేశారు. కోయి కోటేశ్వర రావు గారు విద్య అనగా పర్యావరణ ఎరుక. ఇటువంటి ఎరుక మనకు చాలా అవసరం అన్నారు.సభాధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ.. నివారణోపాయాలు చెప్పేదే జ్యోతిష్య శాస్త్రం, సూచక శాస్త్రం అన్నారు. జ్యోతిష్య శాస్త్రం మహా భారతం కంటే పెద్దదన్నారు. మధ్యాహ్నం తర్వాత జరిగిన రెండవ సమావేశానికి ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించి వ్యాకరణ శాస్త్ర గ్రంథాల్లోని అంశాలను గురించి తెలిపారు. అలంకార శాస్త్ర కావ్యాలు అనే అంశంపై డా. గంధ్ర లక్ష్మణరావు ప్రసంగిస్తూ రసానుభూతిని కలిగించే గుణం కావ్యాలలో ఉండాలన్నారు. డా. సంగనభట్ల నరసయ్య చంధశాస్త్ర కావ్యాలు అనే అంశంపై ప్రసంగిస్తూ శస్త్ర శబ్దం నుండి పుట్టిందే శాస్త్రం అన్నారు. అనాలంటే ప్రాచీన కావ్యాలన్నీ శాస్త్ర కావ్యాలే అవుతాయన్నారు. డా. బూర్ల చంద్రశేఖర్ 60 రోజుల్లో పండే పంటలను గురించి ఐతరేయ బ్రాహ్మణంలో, సస్యానందం అనే లక్షణ గ్రంథాలలో ప్రస్తావించబడిందన్నారు. శాస్త్ర కావ్యాలు - వైద్య శాస్త్రం అనే అంశంపై ప్రొ. జి. రామేశ్వరం ప్రసంగించారు. శాస్త్ర కావ్యాలు - వేదాంతం - అద్వైతం అనే అంశంపై ప్రసంగించిన డా. రాంభట్ల పార్వతీశ్వర శర్మ శాస్త్ర కావ్యాలలో ప్రస్తావించబడిన వేదాంత, అద్వైత అంశాలను వివరించారు.

గురుకుల టీచర్‌గా ఎంపికైన 108 సిబ్బంది

నవతెలంగాణ-భీంగల్



మండలంలోని దేవక్కపేట గ్రామానికి చెందిన సుంకపాక దినేష్ గురుకుల తెలుగు పండిత్‌గా ఉద్యోగం సాధించాడు. దినేష్ గత 15 సంవత్సరాలుగా 108లో ఈఎంటిగా విధులు నిర్వహిస్తూనే బీఈడి పూర్తి చేశాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేవాడు. ఇందులో భాగంగానే గురుకుల తెలుగు పండిత్ గా ఎంపికయ్యాడు. చిన్ననాడే తల్లిదండ్రులను కోల్పోయిన దినేష్ ఆర్థిక భారాన్ని మోస్తూ 108లో విధులు నిర్వహిస్తూనే ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో దేవక్కపేట్ గ్రామస్తులు 108 సిబ్బందిని అభినందించారు

నేటి నుంచి స్వామి వారి ఉత్సవాలు

నవతెలంగాణ-ముప్కాల్

పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం 'శ్రీ మహా శివలింగేశ్వర స్వామి' మహోత్సవాలు బుధవారం ప్రారంభమై ఈ నెల 9న శనివారం రోజుతో ముగుస్తాయని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కనుగుంట లింగం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులపాటు స్వామివారి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతాయని అన్నారు. 9న అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సీనియర్ నాయకున్ని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు శంకర్ గౌడ్‌ను మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలియడంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబీన్ ఖాన్, అంతిరెడ్డి రాజిరెడ్డి, జావీద్ ఉద్దీన్, కురుమే శ్రీనివాస్, సాయాగౌడ్ తదితరులున్నారు.

బైక్ చోరీ కేసులో ఇద్దరు రిమాండ్

నవతెలంగాణ-భిక్కనూర్

బైక్‌ల చోరీకి పాల్పడుతున్నట్టు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ సాయికుమార్ మంగళవారం తెలిపారు. భిక్కనూరు పట్టణంలోని సిద్ధ రామేశ్వర వైన్స్, రేణుక ఎల్లమ్మ ఆలయం సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీ కేసులో ఇద్దరు నిందితులను పట్టుకొని విచారించగా వారి వద్ద సిద్దిపేట పట్టణంలో మరో రెండు ద్విచక్ర వాహనాలు దొంగలించినట్లు ఒప్పుకున్నారు. నిందితుల వద్ద నుండి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు.

జీపీ రికార్డులు తనిఖీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట్ గ్రామపంచాయతీ రికార్డులను మంగళవారం ఎల్లారెడ్డి డి ఎల్ పి వో సురేందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య ఇంటి పన్నుల వాసులపై పలు వివరాలను సంబంధిత అధికారులకు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా విశ్వకర్మ దరఖాస్తులను ఆయన పరిశీలించారు కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీ వో శ్రీనివాస్ ఉన్నారు.

ఎన్నికల సంకల్ప పత్రాలు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, మత, కుల, వర్గాలకు లొంగకుండా స్వచ్ఛందంగా, తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకుంటానని, తల్లిదండ్రులకు తెలియజేయడానికి విద్యార్థులకు సంకల్ప పత్రాలను మంగళవారం మండల మానవ వనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు సి ఆర్ పి మహమ్మద్, యుగేందర్, సురేఖ, సృజన, మౌనిక అందజేశారు.

గృహజ్యోతి పథకంతో సామాన్యులకు ఊరట



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

గృహజ్యోతి పథకం పేద, మధ్యతరగతి ప్రజలకు కరెంట్ బిల్లుల నుంచి ఊరట కల్పిస్తుందన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గృహ జ్యోతి పథకం కింద జీరో బిల్లులను లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దారిద్ర్యరేఖకు దిగు వనున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు 'గృహ జ్యోతి' పథకం వరంలా మారనున్నట్టు తెలిపారు. నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలలో ఈ పథకం కీలకమైందని, 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేసే ఈ పథకం అమలు కోసం సర్వత్రా ఎదురు చూస్తున్నట్టు తెలిపారు. కరెంటు లేకుంటే మనుగడే లేని రోజులని, కానీ, బిల్లుల మోత అందరికీ భారమే అని, ఆ భారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్, మాణిక్ రెడ్డి, పండరి, బసవరాజ్ దేశాయ్, సంజీవ్, శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ సాయినాథ్, లైన్ ఇన్స్పెక్టర్ రామయ్య,సాయి రెడ్డి,కాంత రెడ్డి, రషీద్ ,లబ్ధిదారులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

- ఎక్సైజ్ సీఐ మధుసూదన్ రావు

నవతెలంగాణ-భిక్కనూర్

బహిరంగ ప్రదేశాలలో మద్యం, నిషేధిత పదార్థాలు సేవించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ మధుసూదన్ రావు తెలిపారు. మంగళవారం జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ రవీందర్ రావు ఆదేశానుసారం గ్రామాలలో అనుమానిత ప్రదేశాలు భిక్కనూరు, పెద్ద మల్లారెడ్డి, కాచాపూర్, రామేశ్వర్ పల్లి గ్రామాలలో పౌల్ట్రీ ఫార్మ్, డబుల్ బెడ్ రూమ్, వ్యవసాయ బావుల వద్ద, పల్లె ప్రకృతి వనం అనుమానం ఉన్న ప్రాంతాలలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు తనిఖీలు చేపడుతున్నట్టు తెలిపారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన, గుడుంబా తయారుచేసిన కేసులు నమోదు చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ పరిశీలనలో ఎక్సైజ్ ఎస్సై శ్రావణ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ మొయినుద్దీన్, కానిస్టేబుల్ వహీద్, బాల్ రాజ్, జాకాబ్, స్వాతి తదితరులు ఉన్నారు.

ప్రజా సేవా కేంద్రాన్ని వినియోగించుకోవాలి

నవతెలంగాణ-దోమకొండ



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

బీబీపేట్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పూర్ణ చంద్ర ఆధ్వర్యంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్నా ఆరు గ్యారంటీ లలో భాగంగా ప్రభుత్వ అందించే పథకాల్లో గృహ జ్యోతి ఉచిత విద్యుత్ పథకం కోసం 2 విడత దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారు అర్హులుగా ఎవరికైతే జీరో బిల్ రాని వారు మండల పరిషత్ కార్యాలయంలో ని ప్రజాసేవ కేంద్రంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు ఇవ్వాలని ఎంపీడీవో పూర్ణచంద్ర సూచించారు. దరఖాస్తు పరిశీలించి అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల అందేలాచూస్తామన్నారు. ఇప్పటివరకు 154 దరఖాస్తు స్వీకరించామని తెలిపారు.

ఎల్ఆర్ఎస్‌పై ధర్నాను విజయవంతం చేయండి

నవతెలంగాణ-భీంగల్

ఎల్ఆర్ఎస్ పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నిరసనగా టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో బాల్కొండలో బుధవారం చేపట్టే మహా ధర్నాకు ప్రతి కార్యకర్త తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నరసయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న ఉన్నప్పుడు సీఎం కేసీఆర్ స్థలాల క్రమబద్ధీకరణ కోసం తీసుకువచ్చిన ఎల్ఆర్ఎస్‌పై వ్యతిరేకించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకురావడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్నించారు. ఇది పూర్తి రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న పని అని అన్నారు.

ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆధ్వర్యంలో
పది సొసైటీ చైర్మన్లు కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-మోపాల్



కాంగ్రెస్‌లో చేరిన సహకార సంఘాల చైర్మన్లు

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి చెందిన ఎన్‌డిసిసి బ్యాంక్ డైరెక్టర్ మరియు క్రిబ్కో డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, బాడ్సి సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్ రెడ్డి తో కలిపి పదిమంది సొసైటీ చైర్మన్లు మంగళవారం రూరల్ నియోజకవర్గం క్యాంప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 6 గ్యారెంటీ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరారని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో చెప్పిన హామీల మేరకు ఆరు గ్యారంటీల్లో మూడు అమలు చేశామని ఇంకొన్ని రోజుల్లో మిగతా గ్యారంటీ పథకాలను కూడా అమలు చేసి తీరుతామని అన్నారు. రూరల్ నియోజకవర్గంలో తండ్రి కొడుకులు ఇద్దరు ఎమ్మెల్యేగా వ్యవహరించే వారిని, ఎంతసేపు వాళ్ళ స్వలాభం తప్ప ప్రజల గురించి ఆలోచించ లేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్యాంకర్లతో మాట్లాడుతున్నాడని అది కొలిక్కి వచ్చిన వెంటనే రుణమాఫీ చేసి తీరుతామని తెలిపారు.రైతులకు పంట బీమా కూడా కల్పించి తీరుతామని అన్నారు. సహకార సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి కావాల్సిన సదుపాయాలు వచ్చే విధంగా చూస్తానని ఆయన తెలిపారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 800 కోట్లతో మొదలుపెడితే గత మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్3000 కోట్లకు పెంచి సొంత లాభార్జన కొరకు ప్రాజెక్టుల రీ డిజైన్ చేస్తూ ప్రజల జీవితాలతో ఆడుకున్నాడని ఆయన విమర్శించాడు. మంచిప్ప ప్రాజెక్టు విషయంలో అక్కడున్న రైతులకు తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు. రైస్ మిల్లర్లు క్వింటాలకు 10 కిలోలు 7 కిలోలు అంటూ కడ్తా తీయడం వల్ల ఇటు రైతులకు అటు రైస్ మిల్లర్లకు మధ్యన చైర్మన్లు బాగా సతమతమయ్యారని, ఇక ఆబాధ ఉండదని అన్నారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, మోపాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయి రెడ్డి, శేఖర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, సడక్ శేఖర్ రెడ్డి, అనిల్, రాధా కిషన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రెంజల్ మండలం సాటాపూర్ గ్రామంలో
గృహ జ్యోతి పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-రెంజల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల్లో భాగంగా గృహ జ్యోతి పథకాన్ని మార్చి నుంచి అమలులోకి తెచ్చినట్లు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలను విస్మరించిందని ఎద్దేవా చేశారు. 200యూనిట్ల ఉచితవిద్యుత్ మార్చ్ ఒకటి నుంచి గృహలక్ష్మి పథకం ద్వారా ప్రతి నిరుపేదకు జీరో రీడింగ్‌తో ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం ప్రభుత్వ భూములను కబ్జా చేసుకోవాలన్న తలంపుతో ధరణి పోర్టల్ తీసుకువచ్చి నిరుపేదలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనుంచి తాసిల్దార్ కార్యాలయంలోనే తమ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, నాయకులు జావిద్ ఉద్దీన్, సాయ రెడ్డి, ధనంజయ, గయసొద్దిన్, గంగా కృష్ణ, సిహెచ్ రాములు, ఎంఎల్ రాజు, లచేవారు నితిన్, శనిగరం సాయి రెడ్డి, సాయిబాబా గౌడ్, రవి, షౌకత్, బన్సియ నాయక్, కార్తీక్, గైని కిరణ్, వడ్డెక్క మోహన్, అగ్గు నారాయణ, సిద్ధ సాయిలు, శంషుద్దీన్, సయ్యద్ సల్మాన్ , అష్టం శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, నీరేడు సాయిలు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు నాటక ప్రదర్శనలో జిల్లాలో మొదటి స్థానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నగరంలోని శంకర్ భవన్ పాఠశాలలో నేషనల్ గ్రీన్ క్రాప్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో జిల్లాలోని 20 గ్రీన్ ఎకో క్లబ్ స్కూల్స్ కి చెందిన విద్యార్థులకు ఆల్టర్నేటివ్స్ టూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనే అంశం లో నాటక ప్రదర్శనలో డిచ్ పల్లి మండలం లోని దర్మారం బీ గురుకుల పాఠశాలకు విద్యార్థులు జిల్లాలో మొదటిస్థానం సాధించారు. 9వతరగతికి చెందిన వైష్ణవి, చైత్ర, మమత, శ్రీనిధి 8వ తరగతి కి చెందిన సిరి సహస్ర విద్యార్థుల బృందం నాటక ప్రదర్శనలో పాల్గొన్నారు. వీరికి మూడు వేల రూపాయల నగదు బహుమతి వచ్చిందని గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత మంగళవారం తెలిపారు. అనంతరం విద్యార్థులను హౌజ్ టీచర్స్ దమయంతి, స్వప్న, ఉమరాణి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ధ్యానంతో సర్వ రోగాలు నయం

- డాక్టర్ నీలిమ

నవతెలంగాణ-కోటగిరి

సర్వ రోగాలను నయం చేసే శక్తి ధ్యానం వల్ల కలుగుతుందని డాక్టర్ నీలిమ అన్నారు. జ్ఞాన యజ్ఞంలో భాగంగా 108 రోజులు 108 గ్రామాల్లో మండలకేంద్రంలోని పెద్ద హనుమాన్ ఆలయంలో మంగళవారం డాక్టర్ నీలిమ ఆధర్వంలో అవగాహన కల్పించారు. కోటగిరిలో ధ్యానం వల్ల కలిగే లాభాలను వివరించారు. దీనిలో భాగంగా నీలిమా మాట్లాడుతూ.. ధ్యానం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని అన్నారు. పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళుతున్నామని, ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఆత్మ జ్ఞానం కలుగుతుందని పేర్కొన్నారు. ఎన్నో రోగాలను నయం చేసే శక్తి ధ్యానానికి ఉందన్నారు. కార్యక్రమంలో ధ్యాన నిర్వాహకులు అంజలి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా ఉద్యోగి అవార్డు గ్రహీతకు సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్

మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఎమ్. గంగామణిని మంగళవారం మాజీ సర్పంచ్ సక్కారం అశోక్ సత్కరించారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఉత్తమ మహిళ ఉద్యోగి అవార్డుకు ఉపాధ్యాయురాలు ఎమ్.గంగామణి ఎంపికయ్యారు. అవార్డు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గ్రామస్తుల సమక్షంలో గ్రామ మాజీ సర్పంచ్ సక్కారం అశోక్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.గంగాధర్, ఉపాధ్యాయులు, నాయకులు నెల్ల రమేష్, యస్.నారాయణ, బి.రాజు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-దోమకొండ



పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

దోమకొండ మండలంలోని సీతా రాంపూర్ గ్రామంలో మంగళవారం సీసీ రోడ్డు పనులను ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం నిధుల నుండి సీతారాంపూర్ గ్రామంలో 10 లక్షలు, లింగుపల్లి గ్రామం లో పది లక్షలు, సంగమేశ్వర్ లో 10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీతో పాటు ఎంపీటీసీ ఆసానిజ్యోతి మల్లారెడ్డి, రామస్వామి గౌడ్, మడతల సత్యనారాయణ,సంతోష్ రెడ్డి, భూపాల్ రెడ్డి, సంజీవరెడ్డి, సంజీవ్,గోపాల్ రెడ్డి, గంగయ్య జీవన్ రెడ్డి బాపురెడ్డి రాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో దొంగతనం

- పలుఇళ్ల తాళాలు పగులగొట్టిన దొంగలు

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని రచ్చగల్లిలో శివయ్య ఇంట్లో దొంగలు పడి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. శివయ్య ఆర్మూర్‌లో జీవనోపాధికోసం వెళ్లడంతో ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో మంగళవారం తెల్లవారుజామున దొంగలు ఇంట్లో ఉన్న వస్తువులు చెల్లాచెదురుగా పడవేశారు. ఇంటి పక్కన ఉన్న దుబాస్ రాములు, గజేందర్ ఇంట్లో తాళాలు పగలగొట్టారు. గజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాహెర్‌బిన్‌కు సన్మానం

నవతెలంగాణ-మోపాల్

తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా తాహెర్ బిన్ హందాన్ బాధ్యతలు స్వీకరించడంతో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ యాదగిరి మంగళవారం తాహెర్‌బిన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జిల్లా అధ్యక్షుడిగా ఉండి ఒక రథసారధిగా నడిపించిన వ్యక్తికి పదవి ఇవ్వడం శుభ సూచకమని అన్నారు.